## 'శభాష్' బాబు..!

జూలూరుపాడు, ఏప్రిల్ 21: మనలో ఎవరికైనా.. దారిలో కరెన్సీ నోటు కనిపిస్తే ఏం చేస్తాం..! అటూ ఇటూ చూసి, దానిని తీసుకుని జేబులో పెట్టుకుంటాం. సాధారణంగా జరిగేది ఇదే. కానీ, జూలూరుపాడులో సోమవారం ఓ అసాధారణం జరిగింది.

ఎస్సై సమక్షంలో గొలుసు ఇస్తున్న శోభన్ బాబు

మండలంలోని సూరారం గ్రామానికి చెందిన మహిళ, తన కూతురుతో కలిసి కొత్తగూడెం వెళ్లేందుకు సోమవారం జూలూరుపాడు బస్టాండ్ సెంటర్‌కు వచ్చి, బస్సు రాక కోసం ఎదురుచూస్తున్నది. కొద్దిసేపటి తర్వాత బస్సు రావడంతో కూతురితో కలిసి హడావుడిగా ఎక్కింది. ఈ క్రమంలోనే, ఆమె మెడలోని దాదాపు రెండులక్షల రూపాయల విలువైన బంగారపు నల్లపూసల గొలుసు జారి ఆ బస్టాండ్ సెంటర్‌లో పడిపోయింది. బస్సు వెళ్లిపోయింది. అదే సమయంలో అటువైపు వస్తున్న అన్నారుపాడు గ్రామానికి చెందిన కొమ్మిన్ని శోభన్‌బాబుకు ఆ నల్లపూసల గొలుసు కనిపించింది. దానిని తీసుకుని, నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై బాదావత్ రవిని కలిశారు. విషయం చెప్పి, ఆయనకు ఆ గొలుసు అందించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి, అదే పోలీస్ స్టేషన్‌కు ఓ మహిళ వచ్చింది. తన మెడలోని బంగారపు గొలుసు పోయిందని ఫిర్యాదు చేసింది. ఆమె నుంచి ఎస్సై పూర్తి వివరాలు తెలుసుకుని, ఆ గొలుసు ఆమెదేనని నిర్ధారించుకుని.. దానిని ఇచ్చేశారు. పోయిందనుకున్న, దొరకదనుకున్న విలువైన బంగారపు గొలుసు.. చేతికి అందేసరికి ఆమె అమితానందానికి లోనయింది. తనకు దొరికిన విలువైన వస్తువును నిజాయితీగా తెచ్చిచ్చిన ఆ శోభన్ బాబును.. 'శభాష్ బాబు' అంటూ, ఎస్సై.. పోలీసులు అభినందించారు. ఆ 'శభాష్' బాబుకు, ఎస్సైకి ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

## మృతదేహానికి పోస్టుమార్టం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: అంత్యక్రియలు చేసి పూడ్చిపెట్టిన మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. కొత్తగూడెంలోని చుంచుపల్లికి చెందిన షేక్ హమీద్ తన కూతురు హసీనా బేగం (38)ని 15 ఏళ్ల క్రితం మణుగూరులో సింగరేణి ఉద్యోగం చేస్తున్న అమీర్‌ఖాన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. మృతురాలికి ఒక పాప, బాబు ఉన్నారు. ఈ నెల 6వ తేదీన ఉదయం అమీన్‌ఖాన్ తన మామ హమీద్‌కు ఫోన్ చేసి తన భార్య బాత్‌రూంలో పడిపోయిందని కొత్తగూడెం సింగరేణి హాస్పిటల్‌కు తీసుకొస్తున్నామని చెప్పగా మృతురాలు స్పృహలో లేనందున అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఈ నెల 11న మృతురాలు బ్రెయిన్‌డెడ్ కావడంతో మృతిచెందింది. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్మశాన వాటికలో మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. రెండు రోజులకు మృతురాలి పిల్లలు తన తండ్రి అమీన్‌ఖాన్ గొడవ పడి తన తల్లిని గొడకేసి కొట్టగా కిందపడిపోయిందని, తర్వాత బాత్‌రూంలో కింద పడిపోయిందని చెప్పినట్లు తెలిపారు. దీనిపై అనుమానం ఉందని సదరు మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ వైద్య బృందంచే మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. మెడికల్ రిపోర్టు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

## ప్రతి పేదవాడికి సన్నబియ్యం అందాలి : ఎమ్మెల్యే తెల్లం

పర్ణశాల, ఏప్రిల్ 21: ప్రతి పేదవాడికి సన్నబియ్యం అందాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దనల్లబెల్లి గ్రామంలో పేద గిరిజనుడైన మట్ట శేఖర్ స్వగృహంలో వారి కుటుంబంతో కలిసి ఆయన సన్నబియ్యం భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.


సన్నబియ్యంతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

**కల్యాణలక్ష్మి నిరుపేదలకు భరోసా : ఎమ్మెల్యే తెల్లం**

దుమ్ముగూడెం, ఏప్రిల్ 21: మండల కేంద్రమైన లక్ష్మీనగరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తెల్లం 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

### ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మణుగూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **బాణోత్ స్వప్న** D/o.బాలు, **వయస్సు:** 29 సం||లు, **వృత్తి:**గృహిణీ, నివాసం:ఇ.నెం: 4-165, మల్లెలమడుగు గ్రామం, అశ్వాపురం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి :** జిల్లా రిజిస్ట్రార్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం రెవిన్యూ డివిజన్‌లోని నెల్లిపాక శివారు, అశ్వాపురం మండలం, మల్లెలమడుగు గ్రామపంచాయితీ, మల్లెలమడుగు నందు ఇంటి నెంబరు:4-156కు సంబంధించిన ఇంటి ఖాళీ స్థలము 353.3 చ||గ|| ఖాళీ స్థలము, ఆర్‌సిసి బిల్డింగు :312 చ||అ||, **డాక్యుమెంట్ నెం: 38/2025**,మరియు ఏసిసి రేకుల ఇల్లు 242.00 చ||అ||గల స్థిరాస్థినకు హద్దులు :**తూర్పు:** రోడ్డు, **పడమర:** తోట నాగేశ్వరరావు గారి ఇల్లు, **ఉత్తరము** :రోడ్డు, **దక్షిణము** :వాంకుడోత్ మోతిలాల్ గారి ఇల్లు.

**పలివెల గణేష్ బాబు**
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

# రజతోత్సవ సభకు దండులా కదిలిరావాలి

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బూర్గంపహాడ్, ఏప్రిల్ 21: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు గులాబీ దండులా కదిలి వచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. భద్రాచలం పర్యటనకు వచ్చి మార్గమధ్యలో సోమవారం మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలోని మాజీ జడ్పీటీసీ శ్రీలత రామకొండారెడ్డి నివాసంలో తేనేటి విందులో పాల్గొన్నారు.

**ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి**

బూర్గంపహాడ్, ఏప్రిల్ 21: బూర్గంపహాడ్ మండలానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు భద్రాచలంలోని హరిత టూరిజం హోటల్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం కలిశారు. తెలంగాణ ఉద్యమకారులను 119 నియోజకవర్గాల్లో గుర్తించి వారికి గుర్తింపు కార్డులతో పాటు హెల్త్‌కార్డులు, పెన్షన్ రూపంలో కొంత ప్రభుత్వం లేదా పార్టీ ద్వారా అందించాలని వినతిపత్రం అందజేశారు.

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కష్టించి పనిచేసే మణుగూరు ఏరియా కార్మిక వర్గానికి టీబీజీకేఎస్ అండగా నిలబడి సేవలు అందించడం అభినందనీయమైన అంశం అని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మణుగూరు టీబీజీకేఎస్ నాయకత్వంపై ప్రశంసల జల్లు కురిపించారు. సోమవారం మణుగూరు ఏరియా పర్యటనకు వచ్చిన ఆమెను ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు నాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి శాలువ అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లెందు: కవితతో ఉద్యమకారులు, నాయకులు

**ఎమ్మెల్సీ కవితకు నాయకుల స్వాగతం**

ఇల్లెందు/టేకులపల్లి/పాల్వంచ రూరల్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం భద్రాచలంలో పార్టీ సమావేశానికి వచ్చారు. ఆమెకు తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వీరిలో హరిప్రియానాయక్, దిండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్‌రావు, బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, మల్లెల విశ్వనాథం ఉన్నారు.

**రజతోత్సవ సభకు నిధుల సేకరణ**

అశ్వాపురం, ఏప్రిల్ 21: వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న రజతోత్సవ బహిరంగ సభ కోసం విరాళాలు సేకరించేందుకు సోమవారం బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు మండల కేంద్రంలోని ఈదర సత్యనారాయణ రైస్ మిల్లులో హమాలీ పనిచేసి వినూత్నరీతిలో నిధులు సేకరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బహిరంగ సభకు నిధులు సమకూర్చడానికి హమాలీ పనిచేసి కొంత నిధులు సమకూర్చడం జరిగిందని, గులాబీ సైనికులు స్వచ్ఛందంగా సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## మీ భవిత.. మా బాధ్యత..!

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 21: ''మీ పిల్లల భవితను తీర్చిదిద్దే బాధ్యత మాది. మా బడిలో మీ పిల్లలను చేర్పించండి'' అని, మండలంలోని ఆసుపాక గ్రామంలోగల తల్లిదండ్రులను అక్కడి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి కోరారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా ఆమె సోమవారం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యాబోధనలో అనుభవమున్న ఉపాధ్యాయులు, క్రీడాస్థలం, కంప్యూటర్లు సహా అన్ని వసతులు ఉన్న స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కోరారు. పిల్లలకు చక్కటి విద్య-బుద్ధులు నేర్పించే అవకాశాన్ని తమకు ఇవ్వాలన్నారు. పిల్లల భవితను తీర్చిదిద్దే బాధ్యతను తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామినేని రాంప్రసాద్, తాలపాటి శ్రీను, సల్మాన్, రాజేశ్వరి, నాగలక్ష్మి, రమాదేవి, లక్ష్మి, శిరీష, ఫణికుమారి పాల్గొన్నారు.

ఆసుపాకలో 'బడి బాట'లో ఉపాధ్యాయులు

## పోషకాహారంతోనే ఆరోగ్య రక్షణ

అశ్వారావుపేట, ఏప్రిల్ 21: సరైన పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని, అనేక వ్యాధులను దూరంగా ఉంచవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్, సీడీపీవో ముత్తమ్మ అన్నారు. ఎక్కువ పోషకాలున్న ఆహారం తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉందని చెప్పారు. వ్యవసాయ కళాశాలలో సోమవారం పోషణ పక్షం కార్యక్రమంలో వారు మాట్లాడారు. పోషకాహారం తీసుకోకపోతే వచ్చే వ్యాధులు.. కలిగే నష్టాలను వివరించారు.

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని పాపిడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు ఉషారాణి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అందాల పోటీలు వద్దంటూ ప్రదర్శన

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 21 : హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్న అందాల పోటీలను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి గణేష్ టెంపుల్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభలో పీవోడబ్ల్యూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కల్పన, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జాటోతు కృష్ణ మాట్లాడారు. విష సంస్కృతిని పెంచే విధంగా మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించాలనుకోవడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. వెంటనే పోటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా కర్నాటి కవిత

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 21: కొత్తగూడెం మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా కర్నాటి కవిత నియమితులయ్యారు. హైదరాబాద్ నాంపల్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమె సోమవారం విధుల్లో చేరారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## ఇసుక ర్యాంపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: మణుగూరు మండలం పరిధిలోని ఇసుక ర్యాంపు నిర్వహణలో నిబంధనలు ఉల్లంగించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో మణుగూరు డివిజన్ జాయింట్ సెక్రటరీ పూనెం రమేష్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## భూ భారతితో సమస్యల పరిష్కారం : కలెక్టర్

అశ్వాపురం, ఏప్రిల్ 21 : ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతాంగ సమస్యలకు సత్వర పరిష్కారం లభించనున్నదని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలో భూభారతి చట్టంపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్‌శ్ వి పాటిల్

ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు దీనిపై స్పష్టమైన అవగాహన పెంచుకొని రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అనంతరం కొందరు రైతులు భూ సమస్యలపై అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. సదస్సులో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, మణుగూరు ఏడీఏ తాతారావు, తహసీల్దార్ స్వప్న, ఎండీవో వరప్రసాద్, ఆర్ఐ లావణ్య, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: మణుగూరు మండలం కిన్నెర కల్యాణ మండపంలో నిర్వహించిన భూ భారతి చట్టం 2025పై అవగాహన కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఆర్డీవో దామోదర్ పాల్గొన్నారు. భూభారతి చట్టాన్ని రైతుల సమక్షంలో ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. భూ సమస్యలు, మార్పులు చేర్పులు, మ్యూటేషన్, ఇతర సమస్యలకు ఈ భూభారతి చట్టం పరిష్కారం చూపుతుందని అన్నారు.

## విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

భద్రాచలం, ఏప్రిల్ 21: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి కొర్రాజులగుట్ట ఏహెచ్ఎస్ బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ.25.50లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ భోజన శాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, ఏటీడీవో అశోక్‌కుమార్, హెచ్ఎం నరేందర్, డీఈ హరీష్, టీఏ శ్రీనివాసరావు, ఏఈ ప్రసాద్, వార్డెన్ మోహన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి : ఐటీడీఏ పీవో

భద్రాచలం, ఏప్రిల్ 21 : తమ సమస్యలపై ఆదివాసీ గిరిజనులు సమర్పించిన అర్జీలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి పీవో వినతులు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరించి.. మిగిలిన వాటిని ఆయా శాఖల అధికారులు పంపించారు.


వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

## పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఎస్పీ అభినందన

భద్రాచలం, ఏప్రిల్ 21: ఖమ్మంలో జరిగిన రెండు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు, మాస్టర్ టీం చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోగా భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన డీవీ శంకర్‌రావు, మాస్టర్-4 కేటగిరిలో 83 కిలోల విభాగంలో 60 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. జిల్లాకు మాస్టర్ టీం చాంపియన్ షిప్ కూడా కైవసం చేసుకుంది. ఈ నెల 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 66 కిలోల విభాగంలో మోడెం వంశీకి బంగారుపతకం, మాస్టర్-2 విభాగంలో 93 కిలోల కేటగిరిలో బంగారుపతకం సాధించినట్లు జిల్లా జనరల్ సెక్రటరీ జీవీ.రామిరెడ్డి తెలిపారు. ఈ క్రీడాకారులను ఎస్పీ రోహిత్‌రాజ్ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. జిమ్ కోచ్, అసోసియేషన్ సభ్యులను అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

## 11.50కిలోల ఎండు గంజాయి, నాటుసారా పట్టివేత

భద్రాచలం, ఏప్రిల్ 21: రెండు రోజులుగా ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో భాగంగా భద్రాచలం ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద ద్విచక్రవాహనంపై 11.50 కిలోల ఎండుగంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. ఒడిస్సాలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డారు. వీరి వద్ద గంజాయి, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిస్సాకు చెందిన దాముహంటల్, బీమాగుట్ట అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం కొర్రాజుల గుట్ట, భద్రాచలం, దుమ్ముగూడెం మండలం పర్ణశాల, చిన్ననల్లబెల్లి గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ జి.బాలు, కానిస్టేబుల్ విజయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు మృతి

**మృతుల్లో రూ.కోటి రివార్డు ఉన్న కేంద్ర కమిటీ సభ్యుడు, మరో ఇద్దరు కీలక నేతలు**

**జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలో ఘటన**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 21 : మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన భీకరపోరులో ఎనిమిది మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. జార్ఖండ్ డీజీపీ అనురాగ్ గుప్తా వెల్లడించిన వివరాల ప్రకారం.. బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలోని లుగు గుట్టల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీస్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో 209వ కోబ్రా భద్రతా దళాలు, జార్ఖండ్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులకు దిగడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య దాదాపు రెండున్నర గంటలపాటు కాల్పులు కొనసాగాయి. అయితే జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గం మీదుగా పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలం నుంచి 8 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఏకే-47, ఇన్‌సాస్ రైఫిల్, ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో రూ.కోటి రివార్డు ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వివేక్ అలియాస్ పుచన అలియాస్ నాగ మాంఝీ అలియాస్ కరణ్ అలియాస్ లెతరతోపాటు రూ.25 లక్షల రివార్డు ఉన్న స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అరవింద్ రావ్, రూ.10 లక్షల రివార్డు ఉన్న జోనల్ కమిటీ సభ్యుడు సాహెబ్‌రామ్ మాంఝీ ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. దన్‌బాద్ జిల్లా తుండి పోలీస్‌స్టేషన్ పరిధి దల్‌బుధ గ్రామానికి చెందిన సీసీఎం వివేక్ ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా తన కార్యకలాపాలను కొనసాగించేవాడని, జార్ఖండ్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు దాడుల్లో కీలకంగా వ్యవహరించాడని పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లో అత్యధిక రివార్డులు ఉన్న వారిలో వివేక్ ఒకరు. ఇతడితో పాటు మరో నలుగురిపై రూ.కోటి రివార్డు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వివేక్ భార్య జయ మాంఝీ గత ఏడాది అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందడానికి రావడంతో నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు అమెను అరెస్ట్ చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ కొన్ని రోజుల క్రితం మృతిచెందింది. ఈ ఏడాది జార్ఖండ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో 13 మంది మావోయిస్టులు మృతిచెందగా.. 244 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. కాగా.. 24 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అయితే ఎదురుకాల్పుల్లో కీలక నేత వివేక్ మరణం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బగా మారింది.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, KANDHULA SANDHYA RANI, W/o. Venkata Ramaiah Kandhula, R/o. H.No. 9-1-162/2, Shanthi Nagar Colony, Bhadrachalam (P.O) and Mandal, Bhadradri Kothadudem (District), Telangana-507 111, have Changed My Name to KANDULA SANDHYA RANI and My Husband's Name to KANDULA VENKATA RAMAIAH.
NT-342751

CHANGE OF NAME

★I, NALLAGORLA SRINIVAS RAO, R/o. 9-1-22/3, Gollagatta Road, Bhadrachalam, Bhadradri Kothagudem, TS-507 111. Changed My Name as NALLAGORLA SRINIVASA RAO, S/o. Subbarao.
NT-342752

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

## ఆస్పత్రిలో వివిధ విభాగాలు ప్రారంభం

పాల్వంచ, ఏప్రిల్ 21: పాల్వంచ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్, ఇఎన్‌టీ, డెంటల్, కంటి, ఓపీడీ, ఆపరేషన్ థియేటర్లను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ సోమరాజు దొర పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాలు అందజేత

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 21: ప్రభుత్వ పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులు వేసవి సెలవుల్లో తమ చేతి రాతను మెరుగుపరుచుకునేందుకు ప్రభుత్వం నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నది. ఈ పుస్తకాలను స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో ఆనంద్ కుమార్ సోమవారం అందించారు.

పినపాక, ఏప్రిల్ 21: ఐటీసీ భద్రాచలం వారి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేసేందుకు నోట్ బుక్స్‌ను ఎంఈవో నాగయ్య సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు అందజేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన

ములకలపల్లి, ఏప్రిల్ 21: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. ఆయన సోమవారం మండలంలోని రంగారెడ్డిపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సమావేశంలో మాట్లాడారు. ములకలపల్లి గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిస్టర్ నిర్మల పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ జయప్రదానికి ప్రచారం

చంద్రుగొండ, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ వరంగల్ సభను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు సోమవారం చంద్రుగొండలో ప్రచారం నిర్వహించారు. దారా బాబు, నల్లమోతు వెంకటనారాయణ, భూపతి రమేష్, సూర వెంకటేశ్వరరావు, మొహన్‌రావు, చిన్నపిచ్చయ్య పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంతకాల సేకరణ

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 21: న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ కార్పస్ ఫండ్‌ను రూ.100 కోట్ల నుంచి రూ.500 కోట్లకు పెంచాలని ముఖ్యమంత్రిని కోరుతూ రూపొందించిన వినతిపత్రంపై న్యాయవాదుల సంతకాలను ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) బాధ్యులు సోమవారం కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో సేకరించారు.

## అదనపు తరగతి గది ప్రారంభం

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని కేశవాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సీఎస్సార్ నిధులతో నవభారత్ కర్మాగారం నిర్మించిన అదనపు తరగతి గదిని, మరుగుదొడ్లను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ప్రారంభించారు. తహసీల్దార్ వివేక్ పాల్గొన్నారు.

## గురుకుల డిగ్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 21: అన్నపురెడ్డిపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారి బురాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 90594906 23,8500006021 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## 'భూ భారతి'పై నేడు అవగాహన

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 21: భూ భారతి పోర్టల్‌పై అవగాహన సమావేశాన్ని స్థానిక రైతు వేదికలో మంగళవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ తెలిపారు.

**అశ్వారావుపేటలో 28న..**

అశ్వారావుపేట, ఏప్రిల్ 21: భూ భారతి పోర్టల్‌పై అవగాహన సదస్సును ఈ నెల 28న నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్ తెలిపారు. స్థానిక శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో సదస్సు ప్రారంభమవుతుందన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

పినపాక, ఏప్రిల్ 21: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన భూపాలపట్నం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు. పేదలందరికీ ఇండ్లు మంజూరు చేసిందని అన్నారు.

## పాఠశాలకు సౌండ్ బాక్స్, మైక్ అందజేత

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని ముత్తారపుకట్ట పాఠశాలకు సౌండ్ బాక్స్, మైక్‌ను శ్రీబాలాజీ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ బత్తిని శ్రీనివాస్ సోమవారం అందించారు. ఆయనకు ప్రధానోపాధ్యాయుడు కబ్బాకుల రవి, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

## గాలివానకు విరిగిపడ్డ చెట్టు

చర్ల, ఏప్రిల్ 21: ఆదివారం రాత్రి వచ్చిన గాలివానకు కొద్దిసేపు కరెంటు అంతరాయంతోపాటు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఉరుములు మెరుపులతో సుమారు అరగంట పాటు వర్షం కురిసింది. జీసీసీ డిపో ఎదుట ఉన్న చెట్టు విరిగిపడింది. ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## న్యాయవాదులకు ముత్యాల తలంబ్రాలు

భద్రాచలం, ఏప్రిల్ 21: భద్రాచలం బార్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు సీతారామచంద్రస్వామి దేవస్థానం అందించిన 100 ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ చేతులమీదుగా బార్ అసోయేషన్ న్యాయవాదులకు సోమవారం పంపిణీ చేశారు.

## డ్రంకెన్ డ్రైవర్లకు జరిమానా

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 21: మద్యం మత్తులో వాహనాలు నడిపిన చోదకులకు (డ్రంకెన్ డ్రైవర్లకు) కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు సోమవారం జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. మద్యం మత్తులో వాహనం నడుపుతున్న ఎనిమిది మందిని ట్రాఫిక్ ఎస్సై నరేష్, ఒకరిని పాల్వంచ ఎస్సై రాఘవయ్య, మరొకరిని కొత్తగూడెం త్రీ టౌన్ ఎస్సై పురుషోత్తం, ఇంకొందరిని వన్ టౌన్ ఎస్సై విజయ పట్టుకుని కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచారు. వీరందరికీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

బూర్గంపహాడ్, ఏప్రిల్ 21: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని లక్ష్మీపురంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం పట్టణానికి చెందిన పసుపుతోట నాగేశ్వరరావు (65) బూర్గంపహాడ్ మండల పరిధిలోని లక్ష్మీపురంలో ఓ మిల్లులో పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరాడు. లక్ష్మీపురం పెట్రోల్‌బంకు సమీపంలోకి రాగానే పాల్వంచ వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పుల బాధతో ఆత్మహత్య

టేకులపల్లి, ఏప్రిల్ 21: అనారోగ్యం, అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని కోయగూడెం పంచాయతీ బావోజీతండా గ్రామస్తుడైన భూక్యా లాలు(35)కు వ్యవసాయమే జీవనాధారం. అతడు ఇటీవల వెన్నుపూస ఆపరేషన్ చేయించుకున్నాడు. వైద్య కోసం రూ.4లక్షల వరకు అప్పు చేశాడు. వ్యవసాయం చేయలేని స్థితికి చేరాడు. ఈ సంవత్సరం సరిగా పంటలు పండకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు అప్పులు, ఇంకోవైపు వడ్డీ భారం.. ఇవన్నీ తట్టుకోలేనంత మనోవేదనతో అతడు సోమవారం ఉదయం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అతడు అక్కడే అదే రోజు సాయంత్రం మృతిచెందాడు. ఇతడికి భార్య, పాప, బాబు ఉన్నారు. భార్య భూక్యా సిమ్రాన్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

## అక్రమ నిర్మాణం తొలగింపు

ఇల్లెందు, ఏప్రిల్ 21: స్థానిక బుగ్గవాగు బ్రిడ్జి పక్కన అక్రమంగా నిర్మించిన గదిని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం పోలీసుల సహకారంతో తొలగించారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 21: ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్థాయిలో మండల, జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల గెజిటెడ్/ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో తెలిపారు.

## వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 21: అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను మే 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా తెలిపారు. రాష్ట్రంలోని డీఈవోలు, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్లతో ఆమె సోమవారం జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. పాఠశాల పని దినాలు నష్టపోకుండా ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను వేసవి సెలవుల్లోనే ముగించనున్నట్లు చెప్పారు. జిల్లా-మండల రిసోర్స్ పర్సన్లను కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేస్తుందన్నారు.

## దీర్ఘకాలిక సెలవులో ఎంపీడీవో

అశ్వారావుపేట, ఏప్రిల్ 21: అనారోగ్య కారణాలతో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఆయన దరఖాస్తును సోమవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆమోదించారు. ఇన్‌చార్జి బాధ్యతలను ఎవ్వరికీ అప్పగించలేదు.